ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 01 డిసెంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm

# ఎఫ్ బీఐ చీఫ్ గా పటేల్

వాషింగ్టన్: దేశంలోనే అత్యంత ముఖ్యమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చీఫ్‌గా కశ్యప్ పటేల్‌ను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. 'ఎఫ్‌బీఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ పటేల్ వ్యవహరిస్తునందుకు నేను గర్విస్తున్నా. కాష్ గొప్ప లాయర్, పరిశోధకుడు. దర్యాప్తులో దిట్ట. అమెరికాలో అవినీతి నిర్మూలనకు, న్యాయాన్ని గెలిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్న అమెరికా ఫస్ట్ ఫైటర్. అమెరికా ప్రజల రక్షణలో ఆయన కృషి గొప్పది. ఆయన నియామకంతో ఎఫ్‌బీఐకి పునర్వైభవం తీసుకొస్తాం' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫాంలో వెల్లడించారు. కశ్యప్ పూర్వీకులు గుజరాత్ నుంచి వలస వెళ్లారు. అతని తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. కాష్ తండ్రి, ఉగాండలో నియంత ఈదీ ఆమిన్ బెదిరింపుల కారణంగా అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. యూనివర్శిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఓ లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో మియామీ కోర్టుల్లో లాయర్‌గా వివిధ హోదాల్లో సేవలందించారు.



# ఏటూరునాగారంలో భారీ ఎన్‌కౌంటర్

**ఏడుగురు మావోయిస్టులు మృతి**

**14 ఏళ్ల తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతిపెద్ద ఘటన**

**తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ ఆపరేషన్**



ములుగు: ములుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఎన్‌కౌంటర్‌పై పోలీసులు అధికారిక ప్రకటన చేయలేదు.

**మృతులు వీరే**

ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35)తోపాటు అతని దళ సభ్యులు మృతిచెందారు. మృతిచెందిన వారిలో ఏటూరునాగారం మహదేశ్‌పూర్ కార్యదర్శి ఎగోలపు మల్లయ్య అలియాస్ మధు (43), ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22), ముస్సకి జమున (23), జైసింగ్ (25), కిశోర్ (22), కామేశ్ (23) ఉన్నారు. ఘటనా స్థలంలో రెండు ఏకే 47 రైఫిల్స్, పెద్ద మొత్తం ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. 14 ఏండ్ల తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇది అతిపెద్ద ఎన్‌కౌంటర్ కావడం విశేషం.

# తృతీయ జ్యువెలరీ అధినేతపై కేసు




**టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు మోసాలు**

**పరిణీతి చోప్రా బ్రాండ్ అంబాసిడర్ అంటూ వ్యాపారవేత్త శ్రీజరెడ్డికి బురిడీ**

**కోట్లాది రూపాయలు వసూలు, ఫోర్జరీ చేశారని జూబ్లీహిల్స్ పీఎస్ లో కేసు**

**బాధితుల్లో సమంత, కీర్తిసురేశ్**

హైదరాబాద్ : తృతీయ జ్యువెలరీ అధినేత కాంతి దత్ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా మోసాలు చేశాడు. పరిణీతిచోప్రా బ్రాండ్ అంబాసిడర్ అంటూ మహిళా వ్యాపారవేత్త శ్రీజరెడ్డిని బురిడీ కొట్టించారు. మీకు వ్యాపారంలో షేర్ అంటూ పరిణీతి చోప్రాకు టోకరా వేశాడు. కోట్లాది రూపాయలు వసూలు చేశాడని, ఫోర్జరీ చేసి మోసం చేశాడని జూబ్లీ హిల్స్ పీఎస్ లో కేసు నమోదైంది. శ్రీజరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి కాంతిదత్ ను అరెస్టు చేశారు. కాంతి దత్ బాధితుల్లో హీరోయిన్లు సమంత, కీర్తి సురేశ్, డిజైనర్ శిల్పారెడ్డి కూడా ఉన్నారు. సుమారుగా 100 కోట్ల రూపాయలకు మోసం చేసినట్లుగా గుర్తించారు. మరో వైపు సీసీఎస్ లోను కేసు నమోదవుతోంది.

# భూపాలపల్లిలో క్షుద్రపూజ

**మేకను బలి ఇచ్చిన గుర్తుతెలియని దుండగులు**

**భయాందోళనలో స్థానికులు**

భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కుదురుపల్లి వాగులో క్షుద్రపూజలు కలకలం రేపాయి. వాగులో గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేశారు. మేకను బలిచ్చి తల, మొండెం వేరు చేశారు. గుమ్మడి, కొబ్బరి, నిమ్మకాయలు, గోదుమ పిండి చల్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. 355 హైవే పక్కనే క్షుద్రపూజలు చేయడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఇదే వాగులో క్షుద్రపూజలను చేసిన వ్యక్తులను స్థానికులు పట్టుకున్నారు.

# అదుపులోకి మంటలు

హైదరాబాద్ : మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ సీసీఐ గోదాములో మంటలు అదుపులోకి వచ్చాయి. గత రాత్రి నుంచి ఎగిసిపడుతున్న మంటలను ఆరు అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది అదుపు చేశారు. మంటలకు పత్తి దగ్ధమై కాటన్ గోదాం కుప్ప కూలింది. దీంతో కోట్లల్లో నష్టం జరిగిందని అధికారుల అంచనా వేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# పులిని పట్టుకునేందుకు రంగంలోకి అధికారులు

**జిల్లా అధికారుల నుంచి వివరాలు సేకరించిన పీసీసీఎఫ్ చీఫ్ విల్లు సింగ్**



ఆసిఫాబాద్ : ఆపరేషన్ టైగర్ లో యాక్షన్ లోకి ఉన్నాతాధికారులు దిగారు. వరుస దాడులతో పీసీసీఎఫ్ చీఫ్ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్ జిల్లాలో పులి కోసం వేట సాగుతోంది. ఇద్దరిపై దాడి చేసిన పులి కోసం .. ఆపరేషన్ కొనసాగుతోంది. వరుసగా దాడుల ఘటనలు జరుగుతుండడంతో రంగంలోకి దిగారు అటవీశాఖాధికారులు. నిన్న దాడి చేసిన ఘటన స్థలానికి చేరుకున్నారు అధికారి విల్లు సింగ్ మేర్. లక్ష్మి, సురేశ్ ఇద్దరిపై దాడి చేసింది ఒకే పులి అని నిర్ధారించారు. దీనిపై జిల్లా అటవీశాఖాధికారుల నుంచి వివరాలు సేకరించారు. అయితే ఘటనల్లో లక్ష్మి మృతిచెందగా.. సురేశ్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



# సీఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం

సిద్దిపేట : సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్ పారి శ్రామిక కేంద్రంలో సుమారు 2 వేల కోట్ల రూపాయల తో నిర్మాణమైన కోకాకోలా ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించేందుకు రానున్నారు. డిసెంబరు 2న (సోమవారం ఉదయం 11 గంటలకు) ఆయన హాజరై ప్రారంభోత్సవం చేయనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను పోలీస్, ఆర్ అండ్ బీ, టీ ఎస్ ఐ ఐ సీ అధికారులు చేపట్టారు. హెలిప్యాడ్ ను పరిశీలించారు. గజ్వేల్ ఏసీపీ, రూరల్ సీఐ, పరిధిలోని పోలీస్ స్టేషన్ ల ఎస్ఐ లు పరిశ్రమను సందర్శించారు. పరిశ్రమ ప్రతినిధులతో చర్చించి కార్యక్రమం ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

**పరిశ్రమను సందర్శించిన నర్సారెడ్డి, భూమిరెడ్డిలు**

కోకో కోలా పరిశ్రమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవానికి రానున్న సందర్భంగా ఆదివారం సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూమి రెడ్డిలు పరిశ్రమను సందర్శించారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

